రేషన్ సరుకులకు మంగళం

మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్డుదారులందరికీ నిత్యావసరాలు పంపిణీ చేస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో కుండబద్దలు కొట్టారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా బియ్యం మినహా మరో నిత్యావసర సరుకులను పంపిణీ చేసిన దాఖలాల్లేవు. పైగా 15వ తేదీ నాటికి కేవలం సగభాగం మందికే బియ్యం అందుతున్నాయి. మిగిలిన వారు నెలాఖరు వరకు ఎదురు చూడాల్సి వస్తోంది. నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయకపోవడంతో పాటు బియ్యాన్ని సకాలంలో అందించలేకపోవడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు.
– కొడవలూరు

- బియ్యంతోనే సరి పెడుతున్న ప్రభుత్వం
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- 15వ తేదీకి కూడా సగభాగం మందికే అందుతున్న బియ్యం
- నిత్యావసరాలన్నీ పంపిణీ చేయాలని కార్డుదారుల డిమాండ్


కొడవలూరులో ఎండీయూ వాహనం వద్ద బియ్యం పంపిణీ


బియ్యం కోసం ఎండీయూ వాహనం వద్ద వేచి ఉన్న కార్డుదారులు

దృష్టిసారించని కూటమి ప్రభుత్వం

గత ప్రభుత్వంలో ఇళ్ల వద్దే నిత్యావసర సరుకులు పంపిణీ చేసేలా ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ వాహనాలు ఇంటి వద్దకే వెళ్లి ప్రతినెలా 5వ తేదీ నాటికే సరుకులను అందించేలా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మండలంలో 16,181 కార్డులుండగా, 10 ఎండీయూ వాహనాలున్నాయి. వీటి ద్వారా 5వ తేదీ నాటికే ప్రతి కార్డుదారుకు సరుకులందేవి. ప్రస్తుతం నెలాఖరు వరకు కూడా రేషన్ పంపిణీ పూర్తి కావడం లేదు. దీనిపై ప్రభుత్వం కూడా పెద్దగా దృష్టి సారించకపోవడంతో పంపిణీ దారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఇష్టం వచ్చిన రోజునే పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులు ఇబ్బంది పడతున్నారు.

బియ్యంతో సరి

నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. వ్యాట్ పేరుతో పామాయిల్ ధర అమాంతం పెంచేశారు. చక్కెర, గోధుమలు, కంది పప్పు తదితర నిత్యావసరాల ధరలు బాగా పెరిగిపోయాయి. వీటిని రేషన్ దుకాణాల ద్వారా తక్కువ ధరకే అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నమే చేయడం లేదు. కేవలం బియ్యం పంపిణీకి మాత్రమే రేషన్ దుకాణాలున్నాయన్నట్లుగా మారింది. గతంలో బియ్యంతో పాటు చక్కెర, పామాయిల్, జొన్నలు, రాగులు, కంది పప్పు, బెల్లం తదితరాలను పంపిణీ చేసేవారు. ఇవన్నీ పంపిణీ చేయడం ద్వారా నిరుపేదలకు ఊరటగా ఉండేది. ప్రస్తుతం కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తుండడంతో పాటు అప్పుడప్పుడు చక్కెర పంపిణీ చేస్తున్నారు తప్ప మిగిలిన నిత్యావసర సరుకులేవీ పంపిణీ చేయడం లేదు. ఫలితంగా తక్కువ ధరకు నిత్యావసరాలందక నిరుపేదలు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారు.

సరుకులన్నీ పంపిణీ చేయాలి



రేషన్ కార్డుపై గతంలో వలె నిత్యావసర సరుకులన్నీ పంపిణీ చేయాలి. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ సరిపెట్టడం వల్ల నిత్యావసరాల కొనుగోలు పెనుభారంగా మారుతోంది. కనీసం కందిపప్పు, పామాయిలైనా రేషన్ దుకాణాల ద్వారా తక్కువ ధరకు పంపిణీ చేయాలి. ఇటీవల కాలంలో ఆయిల్ ధరలు అమాంతం పెంచేశారు. కిలో పామాయిల్ ధర మార్కెట్‌లో రూ.115లు పలుకుతోంది. ఇలాంటి సమయంలో తక్కువ ధరకు ప్రభుత్వం పంపిణీ చేసి పేదలకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది.
– ఎస్కే పర్విన్‌బేగం, కొడవలూరు

ఎప్పుడిస్తారో తెలియడం లేదు



గతంలో ఎండీయూ వాహనాలు ఫలానా తేదీన గ్రామానికి వస్తాయని కచ్చితమైన నమ్మకం ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రతినెలా కచ్చితమైన తేదీన రాకపోవడం వల్ల ప్రతిరోజూ వాహనం కోసం వేచి ఉండాల్సి వస్తోంది. వీటిపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రతినెలా ఫలానా తేదీన ఫలానా గ్రామానికి వెళ్లాలన్న నిబంధన విధించాలి. దీనివల్ల పడిగాపులు తగ్గి వంద శాతం కార్డుదారులు బియ్యం పొందే వెసులుబాటు ఉంటుంది.
– యు.జనార్ధన్, నాయుడుపాళెం

క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


ఆభరణాలను అందజేస్తున్న దాతలు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో కొలువైన మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామికి స్థానికులు గురజాల చెంచయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు సుమారు రూ.లక్ష విలువచేసే కేజీ వెండితో చేసిన కిరీటం, వడ్డాణాన్ని అందజేశారు. ఈ ఆభరణాలను ఆదివారం ఆలయంలో అందజేశారు. వీటిని అందుకున్న అర్చకులు దసరా సందర్భంగా అమ్మవారికి అలంకరించారు.

దొరువులపాళెంలో సోమిరెడ్డి పర్యటన


మాట్లాడుతున్న సోమిరెడ్డి

ముత్తుకూరు : మండలంలోని దొరువులపాళెంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పర్యటించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామకూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను విధిగా ధరించాలి



సంగం: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. ఆదివారం రాత్రి ఆయన సంగం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం గమనించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని అందరూ హెల్మెట్‌ను ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో ఆదివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణమోహన్, రవికుమార్ పనినిమిత్తం మోటారు బైక్‌పై గూడూరుకు వెళ్తుండగా, చెముడుగుంట సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్, రవికుమార్‌లకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

లైసెన్సులకు పోటీతత్వం పెరగాలి

- ఎక్సైజ్ సీఐ కిశోర్

కోవూరు : మద్యం దుకాణాల లైసెన్సుల కోసం పోటీతత్వం పెరగాలని, ఈ క్రమంలో దరఖాస్తులు అధిక సంఖ్యలో దాఖలు చేయాల్సిందిగా పొదలకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. లైసెన్సు పొందిన వారు ఏడాదికి ఆరు విడతల్లో లైసెన్సు ఫీజు చెల్లించవచ్చన్నారు. షాపుల ఏర్పాటులో గతంలో ఉన్న నిబంధనలే అమలవుతాయని, ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తవుతుందని తెలియజేశారు. 11న లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు ఉంటుందన్నారు. కోవూరు ఎక్సైజ్ పరిధిలో కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాలు ఉన్నాయని, వాటి పరిధిలో 21 మద్యం దుకాణాలను ఏర్పాటు చేయనున్నారన్నారు. కోవూరులో 6, కొడవలూరులో 5, విడవలురులో 4, అల్లూరులో 6 దుకాణాలకు అనుమతి ఉందన్నారు. ఒక్క వ్యక్తి ఎన్ని దుకాణాలకు అయిన దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కాకాణికి నాయకుల అభినందన


కాకాణిని సత్కరిస్తున్న పేడూరు నేతలు

తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నాయకుల అభినందన పర్వం కొనసాగుతోంది. పేడూరు పంచాయతీకి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం నెల్లూరులోని కాకాణి నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ క్రమంలో పూలమాల, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జానా జాలయ్య, కాల్తిరెడ్డి శీనయ్య, పోశిన వెంకటరమణయ్య, భాస్కర్, నాగరాజు, శివ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నరుకూరు సెంటర్‌లో ట్రాఫికర్




నరుకూరు సెంటర్‌లో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

తోటపల్లిగూడూరు : మండలానికి నరుకూరు సెంటర్ వాణిజ్య కేంద్రంలాంటిది. ఇక్కడ వాహనాల రద్దీతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి. నెల్లూరు నగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనే నరుకూరు సెంటర్ ఉంటుంది. ఇది తోటపల్లిగూడూరు మండలం, నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట మండలాలకు కూడలిగా ఉంది. నెల్లూరు నగరాన్ని పక్కన పెడితే మిగిలిన మూడు మండలాలకు ఇదే ప్రధాన వాణిజ్య కేంద్రం. కోడూరు బీచ్, తోటపల్లిగూడూరు మండల కేంద్రానికి నరుకూరు సెంటర్ నుంచే వాహనాల రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన నరుకూరు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య గత కొంత కాలంగా జటిలంగా మారుతోంది. నరుకూరు సెంటర్‌లోని దుకాణాలు ముందుకు చొచ్చుకుని వస్తుండడంతో ఇక్కడ ఉన్న డబుల్ రోడ్డు కాస్త సింగిల్ రోడ్డుగా కుచించుకుపోయింది. అంతేకాక ఆటోలు, ప్రైవేటు వాహనాలు తమను అడిగేవారు లేరని నడిరోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో నరుకూరు సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గ్రామీణ ప్రాంతమే కదా అని అటు అధికారులు, ఇటు పోలీస్ శాఖ నరుకూరు సెంటర్ ట్రాఫిక్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నరుకూరు సెంటర్‌లో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

కామాక్షితాయికి బంగారు హారం బహూకరణ


కాసుల హారాన్ని ఈఓకు అందజేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని భక్తులు ఆదివారం బహూకరించారు. తిరుపతికి చెందిన ఎల్.సత్యనారాయణ, వెంకట శోభాలక్ష్మి దంపతులు కామాక్షితాయి అమ్మవారికి సుమారు 52 గ్రాముల 184 మిల్లీగ్రాముల హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇస్కపాళెం సెంటర్‌లోనే మద్యం దుకాణం


ఇస్కపాళెం సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణం

- ఈసారైనా మార్చాలని స్థానికుల విజ్ఞప్తి

తోటపల్లిగూడూరు : మండలంలోని ఇస్కపాళెం సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణాన్ని ఈసారైనా మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇస్కపాళెం సెంటర్‌లో గత 15 ఏళ్లుగా మద్యం దుకాణం నడుస్తోంది. నిత్యం రద్దీగా ఉండే సెంటర్‌లో మద్యం దుకాణం ఉండడం వల్ల తరచూ ఇక్కడ జరిగే వివాదాలతో స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మద్యం షాపు ఎదురుగానే తోటపల్లిగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్, సమీపంలోనే ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ బాలురు వసతి గృహం, జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇవన్నీ మద్యం దుకాణానికి దగ్గరలోనే ఇమిడి ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి, గుడికి దగ్గర్లో మద్యం షాపులు ఉండకూడదు. ఈ విషయమై గత పదేళ్లుగా స్థానికులు ఇక్కడ మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం విజయదసమికి ప్రభుత్వం కొత్త మద్యం షాపులు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉంది. ఈ సారైనా ఇస్కపాళెం సెంటర్‌లో అసౌకర్యంగా మారిన మద్యం షాపును గ్రామానికి దూరంగా మార్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలకు దిగక తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

పారదర్శకంగా జరగాలి


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్

కోవూరు : నూతన మద్యం పాలసీ విషయంలో మొత్తం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కోవూరులోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మద్యం షాపుల కోసం దరఖాస్తుల ప్రక్రియ వేగంగా జరగాలన్నారు. మద్యం షాపులకు కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీస్తారన్నారు. ఆయన వెంట సీఐ కిశోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

శక్తిరూపిణి.. ముక్తిప్రదాయిని

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ముక్తిని ప్రసాదించే శక్తిరూపిణిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.


వెంకటాచలం : భవాని అలంకారంలో అమ్మవారు


బుచ్చిరెడ్డిపాళెం : వేణుగోపాలునిగా కోదండరాముడు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్దనున్న రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారు భవాని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కుంకుమ పూజ, పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమాలకు కుంకాల బ్రదర్స్, పిండిబోయిన వెంకయ్య, అన్నమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

లలితాదేవిగా అమ్మవారు

మనుబోలు : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి లలితాదేవి అలంకారం చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆరూరు అనిల్‌కుమార్‌రెడ్డి, అనిత దంపతులు వ్యవహరించారు.

ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామార్చన, త్రిశతి, సాయంత్రం ఖడ్గమాల పూజలు నిర్వహించారు.

శివాలయంలో..

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు అమ్మవారికి తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు చేస్తున్నారు.

అమ్మవారికి అభిషేకం

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు జయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కోనం చినబ్రహ్మయ్య–హైమావతి దంపతులు వ్యవహరించారు.

అన్నపూర్ణాదేవిగా..

మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మధుకైటభవధ అలంకారంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారు ఆదివారం మధుకైటభవధ అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ధనలక్ష్మిగా అమ్మవారు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరీదేవి అమ్మవారు ఆదివారం ధనలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పల్లకిసేవ జరిగింది. కార్యక్రమాలకు ఉభయకర్తలుగా కర్పూరం శివకుమార్ రెడ్డి, తల్లి హైమావతమ్మ వ్యవహరించారు. మైపాడులో ఉన్న శివాలయంలో పల్లకిసేవను వేడుకగా నిర్వహించారు. పల్లిపాడులో కొలువైన మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా గురజాల చెంచయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

వేణుగోపాలస్వామి అలంకారంలో..

బుచ్చిరెడ్డిపాళెం : దసరా ఉత్సవాల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాలెంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం వేణుగోపాలస్వామి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి నేతృత్వంలో అన్నప్రసాదాల వితరణ జరిగింది.


మనుబోలు: లలితాదేవి అలంకారం


పొదలకూరు : ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు


పొదలకూరు : అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


ఇందుకూరుపేట: ధనలక్ష్మిగా చాముండేశ్వరీదేవి